# చౌరాస్తాలో నాయకుడు

ఆ మహానగరంలో చౌరాస్తాలో మధ్యన చిన్న గుండ్రని పార్కు మధ్య నిలబడ్డ నాయకుడు విగ్రహ రూపంలో నిట్టూర్చాడు.

ఎన్నో సంవత్సరాలు దేశ సేవచేస్తే చనిపోయాక తన్ను రాయి చేసి, నడిరోడ్డులో నిలబెట్టి ఏదో ఖైదీని చేసినట్టు వుంచడం అతడికి బాధ కల్గించింది.

రోడ్డుమీద అనేక మంది జనం నడుస్తున్నారు.

సినీమా బొమ్మలవైపు.

చీర్ల అంగళ్ళ వైపు.

పళ్ళ దుకాణాలవైపు.

ఆసక్తితో చూచినంతగా

తనవేపు చూడనేచూడరు.

కారు చర్రుమని పరుగెత్తింది.

వెనకనుంచి లేచిన దుమ్ము అతడి మొహానికి హారతిలా దూపంలా మీదకు వచ్చింది.

ఒళ్ళంతా దుమ్ము.

కడిగేనాథుడు లేడు.

వర్షాకాలంలో మాత్రం ఒళ్ళు కడుగుతాడు వానదేవుడు.

ఎండకాలంలో ఎండకు గొడుగైనా లేదు.

శీతాకాలం రాత్రి చీకటిలో చలిలో వణికిపోతూంటే ఎవరూ పట్టించుకోరు.

బ్రతికిన రోజుల్లో

ప్రజలు తనవైపు ప్రవాహంలా మీదకు వచ్చేవారు తన్ను గురించి తలవని దినంలేదు.

కారుల్లో పరుగెడుతూంటే తొంగితొంగి చూసేవారు.

చనిపోయాక

ఎదురుగా విగ్రహ రూపంలో ఉన్నా

ఎవరూ పట్టించుకోరు.

ఉన్నా లేనట్టే మసలుతుంటారు జనం.

ఎండ మండిపోతోంది నాల్గుగంటలైనా

ఇంత వేసవి ఎప్పుడూ చూడలేదు.

'క్వింఛ్' మంటూ సోడాకాయలు గోల పెడుతున్నాయి.

ఒక కూల్‌డ్రింకు తాగుతే బాగుండు.

బ్రతికి ఉన్నప్పుడు—

తను కనిపిస్తే చాలు

వేసంగుల్లో

కూల్ డ్రింక్స్ అందరూ యిచ్చేవారే.

వీధుల్లో నడిస్తే గొడుగు పట్టేవారే.

చనిపోయినప్పుడు ఎందరు

హాహా కారాలు చేశారు.

అది నిజమైన భావన అనుకుని

తన్మయత చెందాడు నాయకుడు ఇప్పుడు నిజంగా బ్రతికి వస్తే ఏమంటారు జనం.

* * * *

విగ్రహంలోంచి నాయకుడు

బయటికి వచ్చాడు.

మెల్లిగా పార్కుదాటి రోడ్డుమీదకు వచ్చాడు.

దాహమేసింది.

ఎదురుగా సోడా దుకాణంలోకి వెళ్ళాడు.

'ఒక సోడా...' అడిగాడు.

'ఆరుపైసలు'

'లేవు.'

'సోడాలేదు'.

'నేను నాయకుడిని'.

'అయితే నాకేం, నాక్కావలసింది పైసలు!

సోడా యజమాని కొరకొర చూశాడు.

ఇదే యజమాని తనను సన్మానించడానికి యీ చౌరాస్తాలో సభ చేసినప్పుడు అయిదు సంవత్సరాల క్రితం, సభకు వచ్చినవారందరికీ ఉచితంగా కూల్‌డ్రింక్స్ యిచ్చాడు.

'పోనీ రమణయ్య శేట్! అడుగుదాం—ఓ వంద రూపాయలు'.

రమణయ్య బట్టల దుకాణంవైపు వెళ్ళాడు.

రమణయ్య చాలా మర్యాదగా పిలిచాడు.

కూర్చోపెట్టాడు.

'రమణయ్యా!'

'మీ పేరు?'

'నాయకుడు.'

'అలాగా'

'జ్ఞాపకం లేదూ'

'ఎక్కడో చూచినట్టుంది.'

'ఓ వందరూపాయలు కావాలి!'

'ఎందుకు?'

'స్వంత ఖర్చుకు.'

'నా దగ్గర యిప్పుడు డబ్బులేదు...ఉన్నా యిచ్చేలా లేదు పరిస్థితి. కొత్త నాయకుడికి యీ మధ్యనే అయిదు వందలిచ్చాను...!'

'చాలా ఆకలేస్తోంది... హోటలుకు వెడతా—ఓ అయిదు రూపాయిలు ఉంటే యియ్య...'

'నాల్గు రోజులు పోయాక కనిపించండి చూదాం?'

నాయకుడు తెల్లముఖం వేశాడు.

'వెళ్ళండి...చాలా వ్యాపారం పనులున్నాయి! చూసుకోవాలి.'

నాయకుడు వెళ్ళిపోయాడు...

ఒకప్పుడు యీ రమణయ్యే వద్దన్నా వెయ్యిన్నూటపదహార్లు పర్సు బహూకరించాడు. తాను పదవిలో ఉండి ఉచ్ఛ దశలో వున్నప్పుడు—

ఎదురుగా ముష్టివాడు.

గిన్నెచేత్తో పెట్టుకుని అడుక్కుంటున్నాడు.

'ఇదిగో పిలిచాడు నాయకుడు.

ముష్టివాడు తేరిపారి చూశాడు నాయకుడివైపు 'మీరు నాయకులు అచారస్తాలో మీకు విగ్రహం చేయించారు. మీరే అచ్చు మీరే... మీరు ఎంత సేవ చేశారు ఎంతగొప్పవారు ? నాలాంటిముష్టివాడు మీకేంచేయాలి? అన్నాడు దీనంగా.

నాయకుడు నవ్వాడు,

'నాకు ఆకలేస్తుంది. —ఏదైనా తినాలి' ముష్టివాడు తన గిన్నెలో పైసలు లెక్క పెట్టాడు.

పావలా వుంది.

దానితో నాల్గు జామపళ్ళు, రెండు వేరుసెనగ పొట్లాలు కొని

యిచ్చాడు. ఓసోడా తెప్పించాడు.

నాయకుడి ఆకలి తీరింది.

నాయకుడు సంతోషించాడు.

నేనెవరయినది నీకింకా జ్ఞాపకమా! నవ్వాడు నాయకుడు.

'ఎంతమాట సామీ! ఎప్పుడూ మేము మీవిగ్రహం నీడలో బ్రతికే వాళ్ళమే కదూ... మీరు ఎప్పుడూజ్ఞాపక ముంటారు!' నాయకుడు సంతోషించాడు,

తిరిగి వెళ్ళి విగ్రహంలోదూరాడు.

ఆరోజు సాయంత్రం

క్రొత్తనాయకుడు కారులో అలా షికారువెళ్ళాడు.

'ఆ నడిరోడ్డులో విగ్రహం చాలా చిన్నదిగా వుంది. తీయించేయ మన్నాడు'.

'మరో పెద్దది, నాయకుడికి తగిన గౌరవ సూచకంగా, ఏర్పరచ మన్నాడు'.

విగ్రహం తీయించేశారు...

క్రొత్త విగ్రహస్థాపనకు లక్షలు కావాలన్నారు...సొమ్ము ప్రజల్లో వసూలు చేస్తూనేవున్నారు.

ముష్టివాడు స్వయంగా ప్రతిరోజూ పైస యిస్తూనే వున్నాడు.

అయితే నాయకుడి క్రొత్త విగ్రహం వెలువడ లేదు.

కాలం జరిగి పోయింది.

ప్రజలు మర్చిపోయారు ఆవిషయం.

ఒక శుభమూర్తాన పొద్దున్న క్రొత్తనాయకుడి విగ్రహం అక్కడ వెలిసింది. చాలా పెద్దది.

ఎంతో నీడ యిచ్చేది.

కానిముష్టివాడు మాత్రం తనబస మార్చాడు— ఆక్రొత్తవిగ్రహం నీడలో బతుకు గడపనని సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాడు.

—:o:—